
# మాయ



—'సత్య'

సందేహం లేదు!

ఆ మహానుభావుడు బాగా అనుభవించే రాసుంటాడు—'ఇంటిలోని పోరు ఇంతింత కాదయా' అని. లేకపోతే, ఇరవై సంవత్సరాలుగా కాపురం చేస్తూ, ఏదో ఈ నెలాఖరులో ఇంట్లో డబ్బులు లేవని "పది రూపాయలు అదనంగా సంపాదించడం చేతకాదు... సంసారం చేస్తున్నారు... సంసారం" అని ఎంత ఈసడింపుగా అంది. అంటే... ఇంతకాలం ఈ భార్యా భర్తల అనుబంధం... పిల్లలు... అనురాగం... ఇవన్నీ ఒక్క పదిరూపాయలు లేకపోయేసరికి తున్పుమన్నాయన్నమాట!

భానుమూర్తి నడుస్తూనే కోపంతో పిడికిలి బిగించాడు. తీక్షణంగా ఆలోచిస్తూ వుండడంవల్ల అతని నుదురు ముడతలు పడింది. వేగంగా ఆఫీసువైపు అడుగులు వేయసాగాడు.

ఆదివారం... సెలవురోజు ప్రశాంతంగా ఇంట్లో కాలక్షేపం చేయవచ్చనుకున్నాడు. కానీ అతని అంచనా తలకిందులైంది. 'పదిరూపాయలకోసం' భార్య చేస్తున్న తాండవం చూడలేక, టిఫిన్ కూడా చేయకుండా ఆ 'బోను'లోంచి బయటపడి, 'ఆఫీసుబోను' వైపు నడుస్తున్నాడు.

లోకం చాలా చిత్రమైంది. వ్యక్తుల బాహ్యా స్వరూపాన్ని చూసి, వాళ్ల వేషభాషలు, ప్రవర్తనను బట్టి ఏదో ఒక తరహా ముద్రవేసి, తద్వారా ఆనందాన్ని పొందడం రివాజైపోయింది. కానీ, విభిన్నంగా కనిపించే ప్రతి వ్యక్తినీ తరచి చూస్తే, అంతరంగపు లోతుల్లోకి వెళ్ల గలిగితే—అమాయకపు నవ్వుల వెనుక అగ్నిపర్వతాలు బద్దలవుతూ వుంటాయి. ఒక భావానికి మరో అర్థం... ఒక ధోరణికి మరో రకమైన భావం... ఇలా అంతా వైరుధ్యాలమయంగా కనిపిస్తుంది. ఆ వైరుధ్యాల గురించి ఆలోచిస్తే, ఒకొక్క భావం ఒకో కథ అవుతుంది!

ఎంత మరిచిపోదామన్నా ఆ క్షణంలో—కోపంతో చిందులు తొక్కుతూ, కేకలు పెడుతున్న భార్య ముఖమే అతని మస్తిష్కంలో కదలాడుతోంది. 'కోపంలో ముఖాలు ఎంత భయంకరంగా మారిపోతాయి.'

అప్పటికప్పుడు మెదడులో వున్న భార్య రూపాన్ని బలవంతంగా చెరిపివేయడానికి ప్రయత్నిస్తూ, ఆఫీసు ప్రాంగణంలోకి అడుగు పెట్టాడు—భానుమూర్తి.

తన డిపార్టమెంట్‌వున్న హాలులోకి వెళ్లబోతూ, ముందు భాగంలో వున్న తమ కంపెనీ అనుబంధ సంస్థ ఆఫీస్‌రూమ్ వైపుగా వెళ్లాడు. సెలవు రోజు కావడం వల్ల ఓవర్‌టైమ్ చేస్తున్న ఇద్దరు గుమాస్తాలు తప్ప, అంతా ఖాళీగా వుంది.

మాయ సీటువైపు చూశాడు. ఖాళీగా వున్నా నవ్వుతూ వుండే, ఆమె రూపమే కనిపించింది. భానుమూర్తి చికాకంతా క్షణంలో మాయమైనట్లయింది. ఉత్సాహంగా హాల్లోకి వచ్చాడు. ఫాను, లైట్ వేస్తూ, చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేరు. తన సీట్లో కూర్చుని, వెనక్కి జారగిలబడి, కాళ్లు బారజాపి, కళ్లు మూసుకున్నాడు.

మస్తిష్కంలో మళ్లీ మాయ ప్రత్యక్షమైంది. అదే

మనోహరమైన చిరునవ్వు. ముప్పైనంవత్సరాలున్నా ఇరవై ఐదేళ్లున్నట్లు కనిపిస్తుంది. ఒకసారి మెరుపు తీగలా కనిపిస్తే, మరోసారి నిండు పున్నమి వెన్నెల్లో చంద్ర బింబంలా... అమాయకంగా ఎప్పుడూ ఏదో అన్వేషిస్తున్నట్లు కనిపించే వదనం... మాట్లాడే విశాల నేత్రాలు...

'కొందరు తమ రాకతో ఆనందాన్ని తెస్తారు. కొందరు వెళ్లిపోవడం ద్వారా ఆనందాన్ని కలిగిస్తారు' అని ఇంగ్లీషువాడు వూరికే అనలేదు. మాయను చూస్తే కష్టాలన్నీ మరిచిపోదామని ఎందుకనిపిస్తుంది?



ఏమో... కొన్ని విషయాలకు నిర్వచనాలు, కారణాలు వుండవు. తర్కానికి అవి అంతుబట్టవు!

ఇవాళ తన భార్య స్థానంలో మాయవుంటే ఎలా ప్రవర్తించి వుంటుంది? భానుమూర్తి వూహాలో ఒక మెరుపు.

"పది రూపాయలు లేకపోతే పోన్లెండి... అప్పు కోసం ఇప్పుడు ఎక్కడికీ వెళ్లొద్దు. కూరలకు బదులు పచ్చడి, పెరుగుతో సరిపెట్టుకుందాం. పిల్లలు టి.వి. చూస్తూ వుంటే మనం చక్కగా కబుర్లు చెప్పుకుంటూ, సెలవు రోజు హాయిగా గడిపేద్దాం..." అంటుంది. అంతే...

దగ్గర్లో పిల్లలు లేకపోతే, చిలిపిగా ఏమైనా చేస్తుందేమో...

భానుమూర్తి నవ్వుకున్నాడు. మళ్లీ ఎందుకనో ఉలిక్కిపడ్డాడు. తను చాలా 'క్రేజీ'గా ఆలోచిస్తున్నాడా? తన ఆలోచనా విధానం సవ్యంగానే వుందా?

ఉహు... ఇందులో తప్పేమీలేదు. తమ ధోరణికి తగినట్లు మనసులో ఆదర్శవ్యక్తుల రూపాన్ని ప్రతిష్ఠించుకోవడం అందరికీ సహజమే. తమకు సన్నిహితులైన వారిలో అటువంటి గుణాలు ఏ మాత్రం వున్నా వాళ్లపట్ల ఇష్టం ఏర్పడుతుంది. మాయలో అటువంటి గుణాలేవో వున్నాయి. అంతే... అంతకుమించి మరేమీ లేదు! ఆమె తనను మాత్రమే ఆకట్టుకోలేదు. పక్కనే వున్న అనుబంధ సంస్థలో ఆమె చేరి ఇంకా నెలరోజులు కూడా కాలేదు. అప్పుడే ఉద్యోగులందరి ఆదరాభిమానాలూ సంపాయించింది. అలా ప్రతి ఒక్కరినీ ఆకర్షించడం ఎలా సాధ్యమౌతుంది?

భానుమూర్తి మాయగురించి ఆలోచిస్తూ తన మనసును రకరకాలుగా ప్రశ్నించుకుంటూ, ఊహల్లోకి జారిపోయాడు.

* * *

"సార్...!"

ఫైల్ తిరగేస్తూ వున్న భానుమూర్తి తలెత్తి చూశాడు.

"నిన్నటి డైలీ సప్లిమెంట్‌లో మీ కవిత చదివాను. 'బ్రిలియంట్'గా వుందండీ... కంగ్రాచ్యులేషన్స్" అంటూ చేయి చాపింది మాయ.

సహోద్యోగులంతా ఆందోళనగా భానుమూర్తి వైపే చూస్తున్నారు. ఇబ్బందిగా అటు ఇటు చూస్తూ, బెరుకుగా ఆమె వైపే చూసి, చేయందించాడు.

అదే ప్రశాంత వదనం... నవ్వుతూ కరచాలనం చేసింది. కూర్చోమన్నట్లుగా సైగ చేశాడు.

"నాకు 'పొయిట్రీ' అంటే తలనొప్పండీ... కానీ మీరు రాసిన కవిత చదువుతుంటే, చాలా హాయిగా ఫీలయ్యాను. ఐనా మీ కవులు స్త్రీని ఎందుకలా ఆకాశానికెత్తేస్తారు?" అంది మాయ నవ్వుతూనే.

భానుమూర్తికి మొదటినుంచీ ఆమె ధోరణి విచిత్రంగానే వుంటోంది. ఇప్పుడు మళ్లీ అలాగే అనిపించింది. మొదట కవితలంటే ఇష్టం లేదని చెప్పింది. కానీ తన కవిత చదివి సంతోషించానంటోంది. తను స్త్రీ అయివుండి, స్త్రీని ఎందుకలా ఆకాశానికెత్తేస్తారని అంటోంది! ఎందువల్ల?

"నాకు తెలుసు... నేను స్త్రీనై వుండీ, ఇలా ఎందుకంటున్నాననే కదూ మీరు ఆలోచిస్తున్నారు? దయచేసి నన్ను ఒక నగటు స్త్రీగా అంచనా వెయ్యకండి... నా ఉద్దేశం—భావుకులకు మానవతే ప్రధాన ధ్యేయంగా వుండాలి కానీ ప్రత్యేకించి స్త్రీలకు ఏవో ఉన్నతమైన విలువలు, సెంటిమెంట్స్ అవీ ఆపాదించి, వాళ్ల మీద కవితలెందుకు రాస్తారని?"

ఈవిడ ఏదో వాదన పెట్టుకోడానికే వచ్చిందనిపించి, ఫైలు మూసేసి, సిగరెట్ వెలిగించాడు భానుమూర్తి.

"నేనీ కవితలో స్త్రీ ప్రేమమూర్తి అనీ, తనలో అగ్నిపర్వతాలు రగులుతున్నా తను ప్రేమించిన వ్యక్తికోసం—ఎన్ని త్యాగాలైనా చేస్తుందనీ రాశాను. మీరేమంటారు...? స్త్రీ ప్రేమమూర్తి కాదంటారా?" సీరియస్‌గా ప్రశ్నించాడు భానుమూర్తి.

"సార్... ఒక్కమాట అడుగుతాను... చెప్పండి... మీరు ఎప్పుడైనా—ఏ అమ్మాయినైనా ప్రేమించారా?"

మాయ అటువంటి ప్రశ్న వేస్తుందని భానుమూర్తి ఊహించలేదు. వెంటనే చెప్పకపోతే, మరో అస్త్రాన్ని ప్రయోగిస్తుందని "లేదు" అన్నాడు.

"చూశారా... ప్రేమగురించి తెలియకుండా ప్రేమమూర్తి గురించి కవిత రాశారు!" అంది కొంటెగా నవ్వుతూ.

"అంటే... మీ ఉద్దేశం చావు గురించి కవిత రాయాలంటే, చచ్చిపోవాలంటారు!"

గొల్లున నవ్వింది మాయ. మళ్లీ సహోద్యోగులంతా భానుమూర్తి వైపు కసిగా చూశారు. లేడీ టైపిస్టులిద్దరూ అయితే, పక్కకు జరిగి కూర్చుని మరీ గుసగుసలాడుకోవడం ప్రారంభించారు.

"మీ జోక్ బావుందండీ..." అని మళ్లీ మళ్లీ తలచుకుని నవ్వసాగింది.

భానుమూర్తికి కాస్త ధైర్యం వచ్చింది. "సరే... మీరు చెప్పండి... మీరెవరినైనా ప్రేమించారా?..."

మాయ ముఖం క్షణంలో రంగులు మారింది... భానుమూర్తి వైపు సూటిగా చూసింది.

"ప్రేమించాను... కానీ అది ప్రేమ కాదని తర్వాత తెలిసింది." అన్నది మరో వైపు దృష్టిని మళ్లిస్తూ. మళ్లీ ఉన్నట్లుండి "మూర్తిగారూ... ఈ ప్రేమా అదీ ఉత్త నాన్సెన్స్ అని నా అభిప్రాయం... ఏదో ఒక రకమైన ఆకర్షణ... సెక్స్ కోరికల ప్రభావం... వీటికి 'ప్రేమ' అని పేరు పెట్టి, ఓ విశిష్టమైన గుణాన్ని ఆపాదించి, ఒక రకమైన 'భ్రమ'లో పడిపోతాం. ఆ తెర తీస్తే... ఏమీ వుండదు... సారీ ఫర్ ది డిస్టర్బెన్స్... మళ్లీ వస్తాను" అని వెళ్లి పోయింది మాయ.

భానుమూర్తికి చిన్న షాక్ తగిలినట్లయింది. 'ప్రేమ' గురించి మాయ యిలా ఆలోచిస్తోందా?

"గురూగారూ... ఇవాళే మాయ మీకు షేక్‌హాండ్ యిచ్చి, ఆఫీసులో పెద్ద దుమారం లేవదీసిందనుకోండి... ప్రతి వెధవా ఆ టాపిక్కే మాట్లాడుతున్నాడు... మీ కవిత గురించి ఒక్కరూ పట్టించుకోలేదు!"

మన్మథరావు ఒకటవ రౌండ్ కాగానే చర్చ ఆరంభించాడు. అతను భానుమూర్తి పని చేస్తున్న కంపెనీ అనుబంధ శాఖలో హెడ్‌క్లర్క్. భానుమూర్తి కంటే, వయసులో ఐదేళ్లు తక్కువే అయినా, తెలిసిన వారి పలుకుబడి ఉపయోగించి, ముప్పై మూడేళ్లకే అంచెలంచెలుగా హెడ్‌క్లర్క్ స్థానంలోకి వచ్చేశాడు!

మన్మథరావు చాలా 'రొమాంటిక్'గా కనిపిస్తాడు. ఆకర్షణీయమైన విగ్రహం. కష్టపడి ఎక్కడెక్కడి జోకులో

సేకరించి, సమయానుకూలంగా వాటిని ప్రయోగిస్తూ, అందరినీ నవ్విస్తుంటాడు. ఎలాగొచ్చిందో కానీ, అతని 'వల'లో ఆడవారు తేలిగ్గా పడిపోతారని ఒక ప్రచారం కూడా వుంది!

సాటీ 'హెడ్‌క్లర్క్' అనే కాక, తన మనసులోని మాటలన్నీ భానుమూర్తి నమ్మకంగా దాచుకోగలడనీ, అవసరమైతే మంచి సలహాలు కూడా ఇవ్వగలడనీ మన్మథరావు నమ్మకం.

భానుమూర్తికి ఒకోసారి మన్మథరావు ధోరణి విపరీతంగా వున్నట్లనిపించినా, మాటలు మోటుగా వున్నా స్త్రీల మనస్తత్వాల గురించి అతను చెప్పే విషయాలు వినడానికి చాలా ఆసక్తిదాయకంగా వుండడం భానుమూర్తికి నచ్చింది. అందుకే ఇద్దరూ తరచుగా 'బార్'లో కూర్చుని లోకాభిరామాయణం మాట్లాడుకుంటారు.

మన్మథరావు—మాయ ప్రస్తావన తీసుకురావడంతో భానుమూర్తికి కాస్త ఉత్సాహం వచ్చింది.

"గురూగారూ... నేను చూసిన స్త్రీలందరూ ఒక ఎత్తు. మాయ ఒక ఎత్తు... షి ఈజ్ ఎ హార్డ్‌నట్ టు క్రాక్" అన్నాడు మన్మథరావు.

ఆ సమయంలో తను మాట్లాడి ప్రయోజనం వుండదని భానుమూర్తికి తెలుసు. అందుకే మౌనంగా అతని మాటలు వినసాగాడు.

"ఆమె మా ఆఫీసులో నాతో ఎంత చనువుగా మాట్లాడుతుందో, తక్కిన కొలీగ్స్‌తోనూ అలాగే మాట్లాడుతుంది. ఆడవాళ్లతో అసలు మాట్లాడదు... ఆ రామారావుగాడు మాయ తనతో రెస్టారెంట్‌కు వచ్చిందని ఎంతగానో పొంగిపోయాడు. విన్సెంట్‌తో అదే రెస్టారెంట్‌లో ఆమె కనిపించేసరికి వాడికి ఒళ్లుమండిపోయినట్లుంది. నా దగ్గరకొచ్చి, ఆమె గురించి అర్థమైన కూతలూ కూశాడు..." పకపకా నవ్వుతూ మరో రౌండ్‌లోకి ప్రవేశించాడు మన్మథరావు.

"సరే... మీ సంగతి చెప్పండి" అన్నాడు భానుమూర్తి మెల్లగా తన డ్రింక్ 'సిప్'చేస్తూ.

మాయ విచిత్రమైన వ్యక్తి అని అతను ముందే వూహించాడు. ఆమెలో అంతర్లీనంగా వున్న వ్యక్తి స్వభావం ఏమిటన్నదే అతని ఆలోచన. ఆ ఆలోచనకు సరైన రూపం ఎప్పుడు ఏర్పడుతుందన్నదీ అతనికి అర్థం కావడంలేదు.

మన్మథరావు సీరియస్‌గా మొహం పెట్టాడు.

"గురువుగారూ... అందినట్లు కనిపించి అందనివాళ్లు, దొరికినట్లు అనిపించి, దొరకని వాళ్లంటే మనకు చాలా ఇంట్రస్టు ఏర్పడుతుంది. మాయ పట్ల నాకు అలాంటి ఇంట్రస్టే కలిగింది. ఆమెలో ఏదో 'మాయ'వుంది. ఇతరులను రెచ్చగొట్టే గుణం వుంది. ఆరంభంలో ఆమె అందరితో ఎక్కువ చనువుగా వుంటోందని నాకు కోపం వచ్చేది... అర్థంలేని కోపం... కానీ నాతో మాట్లాడడానికి వచ్చినప్పుడు—ఆ కోపమంతా చల్లారిపోయేది. ఆవిడ ఆలోచనలన్నీ నగటు స్త్రీల ఆలోచనలకు భిన్నంగా వుండేవి. చాలా 'మోడర్న్'గా ఆలోచిస్తున్నట్లు అనిపించేది. 'స్త్రీలు ఇలా మాట్లాడతారా?' అని ఆశ్చర్యం కలిగించే టాపిక్స్ మొహమాటం లేకుండా మాట్లాడుతూవుంటే, నేను జవాబు చెప్పడానికి ఇబ్బంది పడేవాణ్ణి.

"ఉదాహరణకి... 'సిగరెట్లు కాల్చడం ఆరోగ్యానికి హానికరం. నిజమే. కానీ మగవాళ్లు కాల్చగా లేనిది ఆడవాళ్లు కాలిస్తే ఏం...? నాకు సిగరెట్ అంటే ఇష్టం వుండదు కానీ, ఇష్టం వుండివుంటే, మగవాళ్లతో పాటు నేనూ కాల్చేదాన్ని' అన్నది ఒకసారి. 'ఈ లెక్కన మీరు స్త్రీలు వైన్ తీసుకోవడాన్ని కూడా సమర్థించేలా వున్నారే' అన్నాను. 'వైనాట్?' అంది గురూజీ... అనడమే కాదు నేను బార్‌కి పిలిస్తే వచ్చి, అక్కడ వైన్ తీసుకుని, 'బార్'లో వున్న అందరిలోనూ సంచలనం సృష్టించింది..." అన్నాడు మన్మథరావు గ్లాసులోకి సోడా వంపుతూ.

—అంటే, తను నగటు స్త్రీ కాదని చెప్పడానికి ఎలాంటి అవకాశాలు లభిస్తే, అవన్నీ ఉపయోగించుకుని, ఆ విధంగా ఆమె ధోరణి చూసి అందరూ దిగ్భ్రాంతి చెందుతూ వుంటే, వాళ్లను చూసి తను సంతోషాన్ని పొందుతోందా?

మన్మథరావు మాటలు వింటూనే, భానుమూర్తి మాయ గురించి ఆలోచించసాగాడు.

మన్మథరావు ఇంకా చెప్పుకు పోతున్నాడు ఉద్వేగంగా "గురూజీ... మన సంగతి మీకు తెలుసుకదా... నాకు స్త్రీ వ్యామోహం ఎక్కువే. బట్ ఐయామ్ ఎ హార్మ్‌లెస్ గై... మన ఆహ్వానాన్ని మన్నించి వస్తే, స్వాగతం... లేకపోతే గుడ్‌బై... అంతే ఈ విషయంలో నస నాకు నచ్చదు. అందుకనే—ఒకరోజు అసలు విషయం బయటపెట్టాను. అప్పుడామె ఏమందో తెలుసా గురూజీ... 'మీరూ అందరి లాగేనన్నమాట... నా ధోరణి చూసి చాలామంది అపార్థం చేసుకుంటున్నారు. ఐ లైక్ పీపుల్... నేను అందరితో స్నేహంగా మాట్లాడుతున్నంత మాత్రాన, కలిసి తిరుగుతున్నంత మాత్రాన అందరికీ అదే ఆలోచనా...? వాట్ ఫన్నీ వరల్డ్' అంది. అలా అంటూ నన్ను జాలిగా చూసింది. చెప్పొద్దూ... నాకు మహా ఉక్రోషం వచ్చింది. 'మీ భర్త మిమ్మల్ని అన్ని విధాలా బాగా చూసుకుంటున్నాడా?' అని అడిగాను గురూ... 'అఫ్‌కోర్స్... నన్ను అన్ని విధాలా బాగా చూసుకుంటున్నాడు' అని చెబుతూ 'అన్ని విధాలా' అన్న మాటలు నొక్కి మరీ చెప్పింది. ఆ విధంగా మాయ నా మీద చిన్న దెబ్బతీసింది. తీస్తే తీసింది కానీ ఆవిడొక 'కారెక్టర్' గురూ" అన్నాడు మన్మథరావు వేదాంతిలా నవ్వుతూ.

మన్మథరావు 'అహం' బాగా దెబ్బతిన్నదని అర్థమైంది భానుమూర్తికి. మాయ ఉద్దేశం కూడా బహుశా అదేనేమో!

అందరూ తననే ప్రత్యేక వ్యక్తిగా చూడాలనుకోవడం, అందుకు తగినట్లు ప్రవర్తించడం, ఎవరైనా అది అలుసుగా తీసుకుంటే, వాళ్ల అహాన్ని దెబ్బతీయడం..? దీనివల్ల ఆమెకు సంతోషం కలుగుతోందా? కలిగినా ఆ కృత్రిమపు సంతోషం వల్ల ప్రయోజనం ఏమిటి?

మన్మథరావు మొహం జేవురించింది. అతన్ని మరో 'మూడ్'లోకి మళ్లించడం మంచిదని, ఆఫీసు విషయాలు మాట్లాడడం ప్రారంభించాడు భానుమూర్తి.

* * *

మర్నాడు 'లంచ్ టైమ్'లో భానుమూర్తి సీటుకు వచ్చింది మాయ. అదే చిరునవ్వు... అవే కొంటె చూపులు...

ఎందుకనో... ఆమెతో చాలా జాగ్రత్తగా మాట్లాడడం మంచిదనుకున్నాడు భానుమూర్తి.

ఏం మాట్లాడుతున్నా భానుమూర్తి పొడిపొడిగా సమాధానాలు చెబుతూ వుండేసరికి, 'మీరివాళ 'మూడ్'లో లేరు... మళ్లీ వస్తాను' అని వచ్చిన రెండు నిమిషాలకే వెళ్లిపోయింది. భానుమూర్తి బరువుగా నిట్టూర్చాడు ఆమె వంకే చూస్తూ.

ఆ తర్వాత ఒక సమాచారం కోసం అనుబంధ సంస్థ పర్సనల్ ఫైల్స్ తిరగేస్తూ వుంటే, ఒక ఫైల్‌లో భానుమూర్తికి మాయ ఉద్యోగపు దరఖాస్తు కనిపించింది. కుతూహలంగా ఆ వివరాలు చదివాడు. అందులో మాయ పుట్టిన రోజు వుంది. సెప్టెంబరు 28 ఆమె పుట్టిన రోజు. అంటే వచ్చే ఆదివారమే. అందులో వున్న ఆమె ఇంటి చిరునామా విడిగా ఒక కాగితం మీద రాసుకున్నాడు.

ఆదివారం నాడు ఆమె ఇంటికి వెళ్లి, పుట్టినరోజు కానుకగా 'స్వీట్స్' యిచ్చి, ఆమెను ఆశ్చర్యపరిస్తే ఎలా వుంటుంది? ఫైల్ మూసేసి, ఇంకా మనసులో అస్పష్టంగా వున్న ఆమె రూపం గురించే ఆలోచించసాగాడు భానుమూర్తి.

* * *

నారాయణ గూడా నుంచి సికింద్రాబాదులోని న్యూబోయి గూడాకు వచ్చేసరికి సాయంత్రం ఐదయింది. డోర్ నెంబర్లు చూసుకుంటూ ఒక ఇంటి ముందు ఆగాడు భానుమూర్తి.

తలుపుమీద 'మాయా మోహన్' అని రాసివుంది. కాలింగ్‌బెల్ నొక్కాడు.

మాయ వస్తుంది, తనను చూడగానే 'వాట్ ప్లెజంట్ సర్‌ప్రైజ్' అని నవ్వుతూ తనని ఇంట్లోకి ఆహ్వానిస్తుంది...

ఒక నిమిషం తర్వాత మళ్లీ కాలింగ్ నొక్కబోతూ వుంటే, తలుపు తెరుస్తున్న చప్పుడైంది.

వచ్చింది మాయే... కానీ ఏమిటలా శోక దేవతలా వుంది?... తనను చూడగానే తడబడుతూ, రాని నవ్వును పులుముకోడానికి ప్రయత్నించింది.

"రండి" అని అంటూ "ఒక్కక్షణం" అని లోపలికి పరుగెత్తింది. ఆ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుందామా? వద్దా? అని సందిగ్ధంలో పడి, కూర్చున్నాడు భానుమూర్తి.

"ఆ... ఎవరూ? పాత ప్రియుడా? కొత్త ప్రియుడా?" అన్నమాటలు, 'దబ్' అని ఎవరినో కొట్టిన చప్పుడు, చిన్న కేకా వినిపించేసరికి నివ్వెరపోయాడు భానుమూర్తి.

"ప్లీజ్... పూరుకోండి... అలా మాట్లాడకండి... హెడ్ క్లర్క్ భానుమూర్తిగారు వచ్చారు... నన్ను తిట్టాలన్నా కొట్టాలన్నా ఆయన వెళ్లిపోయాక... మీ ఇష్టం... ప్లీజ్... రండి... మీకు పరిచయం చేస్తాను!"

చిన్న ఇల్లు కావడం వల్ల మాయ ఎంత మెల్లగా మాట్లాడుతున్నా భానుమూర్తికి ఆమె మాటలు వినబడుతూనే వున్నాయి.

"ఓహో... ఆఫీసు ప్రియుడా... ఐతే మధ్యలో నేనెందుకు? 'ఈ కుంటివెధవతో మనకేమిటి?'... అని వచ్చినవాడు లోపల్లోపల నన్ను తిట్టుకోడానికా... ఆ మాట్లాడతున్న వ్యక్తి కంఠస్వరం వినడానికి కఠోరంగా

వుంది. ఇంతలో క్రచెస్‌తో ఓ వ్యక్తి కుంటుకుంటూ—పక్క గదిలోకి వెళ్లడం చూశారు భానుమూర్తి.

మరో రెండు నిమిషాలకు మాయ నవ్వుతూ వచ్చి భానుమూర్తిని పలకరించింది. 'ఫ్రెష్'గా కనిపించడానికి ఎంత ప్రయత్నించినా ఆ వాచిన బుగ్గలు, ఏడ్చినందువల్ల ఉబ్బిన కళ్లు ఆమె అనుభవించిన ఆవేదనను దాచలేకపోతున్నాయి.

"సారీ సార్... మా వారికి ఆరోగ్యం బాగోలేదు. అందుకనే పరిచయం చెయ్యలేకపోతున్నాను." అంది మాయ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఇట్సాల్ రైట్... మీకు 'మెనీ హాపీ రిటర్న్స్' చెప్పడానికి వచ్చాను. ఈ స్వీట్స్ తీసుకోండి!" అన్నారు భానుమూర్తి చేతిలో వున్న పాకెట్ ఆమెకు అందిస్తూ.

ఆమె కళ్లు ఆశ్చర్యంతో మిలమిలా మెరిశాయి. ఆ రోజు ఆమె పుట్టిన రోజన్న సంగతి ఆమె మరిచిపోయిందని భానుమూర్తికి అర్థమైంది.

"ఓ... థాంక్యూ... వెరీ నైస్ ఆఫ్ యు సార్... ఉండండి... ఒక్క నిమిషంలో మీకు టీ తీసుకొస్తాను." అంది తన తడబాటును కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తూ.

ఆమె లోపలికి వెళ్లగానే భానుమూర్తి లేచాడు. అతని మనసంతా చిందరవందరైపోయింది. అక్కడ కూర్చోవడం దుర్భరంగా తోచింది.

నెమ్మదిగా లేచి, ఇంట్లోంచి బైటికి వచ్చారు. బరువుగా అడుగులు వేసుకుంటూ కొంత దూరం నడిచేసరికి 'బాబుగారూ' అన్నమాట వినిపించింది.

"బాబూ... నేను మాయమ్మగారింట్లో పని మనిషిని. మీరు వాళ్లకు తెలిసిన వాళ్లలా వున్నారు. అందుకే మీకు చెప్పాలనిపించింది. మాయమ్మ గారిని... ఆ కుంటిమొగుడు రోజూ ఏదోసాకు చెప్పి కొడతానే వుంటాడు బాబూ... అతనికి యాక్సిడెంట్‌లో కాలు పోయి, పనిపోయిన దగ్గర్నుంచీ ఇంట్లోనే కూర్చుని తింటూ తాగుతూ వుంటాడు. ఆ అమ్మగారు ఇంటికొస్తే రాక్షసుడిలా సాధిస్తాడు. తిని కూర్చోక, ఆమెను బాధ పెట్టడం ఏం న్యాయం బాబూ... చదువుకున్నోళ్లు మీరే ఏదైనా మాట్లాడి చూడండి బాబూ... ఆ నచ్చినోడు ఏదో ఒక రోజు మాయమ్మగారిని చంపేస్తాడేమోనని భయంగా వుంది బాబూ..." దుఃఖంతో ఆ ముసలమ్మ గొంతు పూడుకుపోయి, ఆపైన మాటలు రాలేదు.

రోడ్డు మీద పోతున్న వాళ్లు వాళ్లవైపు వింతగా చూస్తూ, పోతూవుంటే, భానుమూర్తికి ఆ క్షణంలో ఆమెతో ఏం చెప్పాలనీ తోచలేదు. అప్రయత్నంగా అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

తన బాధ ఆమె చూడడం ఇష్టంలేక, ఆమెచెప్పింది అర్థమైనట్లుగా తలవూపి, వెనక్కి తిరిగాడు. అంతవరకూ మనసులో అస్పష్టంగా, తెరలు తెరలుగా వున్న మాయ స్వరూపం అతనికిప్పుడు స్పష్టంగా తెలుస్తోంది.

సూర్యాస్తమయం అవుతోంది.

జీవన సమరాగ్నిలో మండిపోతూ, భగ్న హృదయంతో క్రుంగిపోతున్నట్లుగా వున్న ఆ సూర్యబింబం—ఇంకా భూమి మీదకు కాంతి కిరణాల వర్షం కురిపిస్తూనే వుంది. ఆ కిరణాల్లో, ఆ నీడల్లో... ఏవేవో రంగులు...

భానుమూర్తికి ఆ అరుణ బింబం... ఆ కాంతి కిరణాలు... అంతా మాయగానే కనిపించింది!

...makoti Seeta Rama Sastry
WRITER APSEB JAO
RAMAKRISHNA NAGAR
Plot No 24
SRIKAKULAM

## వనిత

# అభిప్రాయ సేకరణ ఫలితాలు

ఆగస్టు సంచిక 'వనిత'లో ఇచ్చిన 'వనిత— అభిప్రాయసేకరణ'కు సంబంధించిన పత్రాలు—నిర్ణయింపబడిన కాలంలో వేలాదిగా మాకు చేరాయి. అందుకు పఠితలకు మా కృతజ్ఞతలు. పఠితలలో అధిక సంఖ్యాకుల సూచనల మేరకు ఈ సంచికలోనే కొన్ని మార్పులు చేశాము. రానున్న సంచికలలో పాఠకుల అభిరుచులకు అనుగుణంగా 'వనిత'ను వినోద, విజ్ఞానదాయినిగా మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి మావంతు కృషి మేము చేస్తామని మనవి చేస్తున్నాము. ఆగస్టు సంచికలో ప్రకటించిన ప్రకారం వచ్చిన అభిప్రాయసేకరణ పత్రాల నుంచి పది పత్రాలను లాటరీ పద్ధతిలో తియ్యడం జరిగింది.



సుప్రసిద్ధ నటీమణి, నిర్మాత

## శ్రీమతి జయసుధా నితిన్ కపూర్

ఆ 'అదృష్టపత్రాలను' తీశారు. ఆ పది మందికి
బహుమతి మొత్తం రూ.500 లు పంచి అందజేస్తున్నాము. వారు:

1. వి.శారద, హైద్రాబాదు 2. డి.రోజాచార్లెట్, మాచర్ల 3. ఆర్.వి.కామేశ్వరి, మద్రాసు 4. ఎస్.వి.ఎస్.లక్ష్మి, విజయవాడ 5. కె.జయలక్ష్మి, హైద్రాబాదు 6. బి.అన్నపూర్ణ, గుంటూరు 7. ఉమాబాపూజీ, న్యూబొంబాయి 8. కె.జానకీదేవి, భీమవరం 9. జి.రమాదేవి, జగిత్యాల 10. పి.నారాయణమ్మ, విశాఖపట్నం

అభిప్రాయ సేకరణలో విజేతల పత్రాలు తీసిన శ్రీమతి జయసుధ గారికీ పాల్గొన్నవారందరికీ మరొకసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ-గెలుపొందిన వారిని అభినందిస్తున్నాము.